క్లుప్తంగా

అధిక ఫీజులను నియంత్రించాలి



ఆత్మకూరు : మండలంలోని ప్రయివేటు పాఠశాలలు తీసుకుంటున్న అధిక ఫీజులను నియంత్రించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మైదం రవి, సలీం పాషా, తరుణ్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ తల్లి రాజేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ రమేశ్, నాయకులు నరసింహరాములు, సారయ్య, గౌస్, మహేందర్ రెడ్డి, రాకేశ్, సాయి, అశోక్, గణేశ్ ఉన్నారు.

ఎల్ఓసీ అందజేత



వేలేరు : మండల కేంద్రానికి చెందిన ఎండి.తాయబ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ సర్పంచ్ మల్లికార్జున్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితుడికి సీఎం సహాయనిధి నుంచి రూ.2,50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్ఓసీ పత్రాన్ని ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా గురువారం అందజేశారు. యూసుఫ్, ఎండి.బాబా, సాజిద్‌పాషా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గత రాత్రి నుంచి కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం సూసైడ్‌నోట్ రాసి ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపారు. తాను కష్టపడి సంపాదించిన భూములను ఇతరులు కబ్జా చేయాలని చూస్తున్నారని, ఈ విషయంలో కొందరు అధికారులు, మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు ఉన్నారని అందులో రాసి ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా తనపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని చూస్తున్నారని, తనకు జీవితం మీద విరక్తి చెంది వెళ్తున్నట్లు అందులో ఉందని తెలిపారు.

వెనుదిరిగిన లబ్ధిదారులు



నడికూడ : అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల్లో మార్పు, చేర్పులు చేసుకునేందుకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులకు నిరాశ తప్పడం లేదు. ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించినా అందులో ఎడిట్ ఆప్షన్ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

ఐనవోలు : ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం ముల్కలగూడెం గ్రామంలో ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు.

రేపు కేటీఆర్‌ను కలవనున్న కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఆ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు ఈనెల 22న భేటీ కానున్నారు. వరంగల్ బల్దియా కౌన్సిల్ హాల్‌లో అధికార కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడుగడుగునా ఇరుకున పెట్టించి అడ్డుకున్నా తీరుపై సమాచారం తెలుసుకున్న కేటీఆర్.. సభ్యులకు గురువారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. బీఆర్ఎస్ సభ్యులు ఎలా వ్యవహరించాలనే విషయాలపై చర్చించనున్నట్లు సమాచారం. శాసన మండలి వైస్ చైర్మన్ ప్రకాశ్, ఎమ్మెల్సీలు సారయ్య, శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, నరేందర్ కలువనున్నారు.

పునాదులకే పరిమితం

- అసంపూర్తిగా సబ్‌సెంటర్ భవన నిర్మాణం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిన పనులు
- అద్దె ఇంటిలో కొనసాగుతున్న సబ్‌సెంటర్

ఆత్మకూరు : నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.20 లక్షల నిధులతో మండల కేంద్రంలో ఏడాది క్రితం హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. పోచమ్మ సెంటర్‌లో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా ఆ భవనాన్ని కూల్చివేసి ఆ స్థలాన్ని సబ్‌సెంటర్ నిర్మాణానికి అప్పగించారు. ఏడాది క్రితం కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని ప్రారంభించి పునాదుల వరకు పూర్తి చేశారు. ఆ తర్వాత నిర్మాణ పనులను ఆపుదల చేయగా ఆరు నెలల నుంచి అసంపూర్తిగానే ఉంటోంది. ప్రస్తుతం సబ్‌సెంటర్ గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఇంటిని అద్దెకు తీసుకుని కొనసాగిస్తున్నారు. అద్దె భవనం ఇరుకుగా ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది కూడా సేవలు అందించేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అద్దె భవనంలో వసతులు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరైన భవన నిర్మాణం పూర్తి చేయకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన సబ్‌సెంటర్ నిర్మాణ పనులు



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సబ్‌సెంటర్

ఉన్నతాధికారులకు తెలిపాం..

సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు ఆగిన విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే పనులు ప్రారంభించి భవన నిర్మాణం పూర్తి చేస్తాం.

- రత్నాకర్, ఏఈ (ఎన్ఆర్‌హెచ్‌ఎం)

డాక్యుమెంట్లలో తప్పలకు తావివ్వొద్దు

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కమలాపూర్ : ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ప్రతి పనికి వర్క్‌ఫైల్‌లో 21 డాక్యుమెంట్లను తప్పనిసరిగా నమోదు చేసి, పొరపాట్లు లేకుండా జాగ్రత్త పడాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు (అడిషనల్ డీఆర్డీఓ) సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వారు రానున్న రోజుల్లో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీకి సంబంధించిన ప్రతి పని ప్రదేశంలో వర్క్ సైట్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనుల్లో ప్రతి గ్రామానికి సంబంధించి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఏడు రిజిష్టర్లు (నాలుగు సంవత్సరాలవి) అప్‌డేట్ చేయాలని అన్నారు. ప్రతి కూలీ వద్ద ఉన్న జాబ్‌కార్డులో అన్ని రకాల వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా గ్రామ పంచాయతీకి నిర్దేశించిన ప్రకారం హరిత హారం మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో శుక్రవారం యోగా డే నిర్వహించి ఫొటోలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గుండె బాబు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా టెక్నికల్ విభాగం ఈసీ శ్రీధర్, ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై ప్రధాని నోరు విప్పాలి



ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



వేలేరు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి : నీట్ పేపర్ లీకేజీపై న్యాయ విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేయాలని, వైద్య విద్య ప్రవేశ పరీక్షలను రాష్ట్రాలకు అప్పగించాలని సీపీఐ నాయకులు అన్నారు. ఈ సంఘటనపై ప్రధాని నరేంద్రమోదీ నోరు విప్పాలని డిమాండ్ చేశారకు. ఈ మేరకు మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ -కరీంనగర్ ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు గడ్డం రాజనర్సు, విజయ్, ఇంజాల పోచయ్య, పిన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : నీట్ పరీక్ష పత్రం లీకేజీ ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ హెచ్.కోమికి గురువారం వినతిపత్రం అందించారు. గతంలో నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి, వైద్య, విద్య ప్రవేశ పరీక్షను రాష్ట్రలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం విద్యార్థులకు శాపంగా మారిందని కేంద్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని సూచించారు. సీపీఐ నాయకులు గొల్లెన నాగరాజు, మేకల శంకర్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు



ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి తనపై కావాలని తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని మాజీ ఉప సర్పంచ్ రావుల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం గంకిడి శ్రీనివాస్‌రెడ్డి అతని తండ్రి దామోదర్‌రెడ్డి, సోదరుడు గోపాల్‌రెడ్డి ముగ్గురు కలిసి బొల్లం వీరస్వామి భూమిని కబ్జా చేసి చదును చేస్తుండగా బొల్లం వీరస్వామి అడ్డుకున్నాడని తెలిపారు. దీంతో అతడిపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. అయితే వీరస్వామికి బలమైన గాయం కావడంతో దామోదర్‌రెడ్డి తనకు తానుగా గాయపరుచుకొని మడికొండ పోలీస్ స్టేషన్‌లో కక్షపూరితంగా తనతో పాటు తండ్రిపై దాడి చేసినట్టుగా ఫిర్యాదు చేశాడని ఆరోపించారు. అయితే గంకిడి శ్రీనివాస్‌రెడ్డి కక్ష పూరితంగా తనతో పాటు మరికొందరి పేర్లు సూసైడ్ నోట్‌లో రాసి ఇంటి నుంచి వెళ్లిపోయి బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు నిజమైన విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, మాజీ వార్డు సభ్యులు పుట్ట నవీన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల సవరణకు కౌంటర్లు ఏర్పాటు



కౌంటర్ వద్ద దరఖాస్తు స్వీకరిస్తున్న సిబ్బంది

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందించనున్న గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరించేందుకు, తప్పొప్పులను సవరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి గ్యాస్ సబ్సిడీ అందకున్నా, 200 లోపు యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించకున్నా కౌంటర్ల వద్ద దరఖాస్తు అందించాలని సూచించారు. దరఖాస్తుల సవరణకు వచ్చే లబ్ధిదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, గ్యాస్ బిల్లు, ఒరిజినల్ గ్యాస్ బుక్, కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తులకు ఇచ్చిన మొబైల్ నెంబర్ వెంటతీసుకొని రావాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థమే కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కులవృత్తులపై ప్రభుత్వం చిన్నచూపు

- ఎమ్మెల్సీ సిరికొండ

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను చిన్నచూపు చూస్తుందని మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. మండల కేంద్రంలోని పరికిరాల స్వామి కులవృత్తిలో భాగంగా లాండ్రీ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుండగా గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే కులవృత్తులకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. బీసీ కార్పొరేషన్ రుణాలను, దళితులకు దళిత బంధు పథకం అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పాటు అందించారని అన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కులవృత్తులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కులవృత్తులను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సూచించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, పరికరాల స్వామి, బండి రంజిత్, అశోక్, పోశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

సాధారణ ప్రసవాలను పెంచాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : సివిల్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచేందుకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక సివిల్ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి భవనం సరిపోనందున రోగులకు వైద్య సేవలు అందించడం కొంత అసౌకర్యంగా మారిందని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోగులపై అలసత్వం వహించకుండా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ నర్సింహ, ఎంపీపీ స్వర్ణలత, సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్ పాల్గొన్నారు.

మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలి

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమకు జీ.ఓ 510ను సవరణ చేసి నెలవారీ వేతనాలు ఒకటో తేదీనే అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులపై సమీక్షించేందుకు పరకాల సివిల్ ఆసుపత్రికి చేరుకున్న ఆయనకు జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యను విన్నవించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మంది కుటుంబాలు సరైన సమయానికి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్పందించిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బత్తుల విష్ణుమూర్తి, ఉద్యోగులు రోజా, ప్రమీల, సుమలత, ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న రేవూరి

కబ్జాకు యత్నిస్తున్నవారిపై చర్య తీసుకోవాలి



ఫెన్సింగ్ వేసిన క్రీడాప్రాంగణ స్థలం

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి గురువారం తెలిపారు. గుండ్లసాగర్ గ్రామంలో సర్వే నంబర్ 2లో 2.05 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదల ఇళ్ల స్థలలా కోసం 2003లో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. అప్పటి తహసీల్దార్ 65 మంది లబ్ధిదారులకు పట్టాలు కూడా మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి 2006లో రోడ్డు, నీటి సదుపాయం కోసం బోరు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో కొంతమంది లబ్ధిదారులు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. గ్రామానికి చెందిన గాదె అనంతరెడ్డి, ఆయన కుమారుడు రాజిరెడ్డి ఇదే ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని నివసిస్తున్న వారి దగ్గరకు వెళ్లి ఈ భూమి తనదని బెదిరిస్తున్నారని ఆరోపించారు. జేసీబీ సాయంతో ఇళ్లను కూల్చడానికి ప్రయత్నం చేస్తున్నారని, గతంలో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలంలో డోజర్ సాయంతో చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నట్లు ఆరోపించారు. కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి విపత్తులపై విద్యార్థులకు అవగాహన



వరంగల్ / మామునూరు: ప్రకృతి విపత్తులు, మ్యాన్ మేడ్ డిజాస్టర్లు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ముందుజాగ్రత్తలపై ఎన్‌డీఆర్ఎఫ్ జాతీయ విపత్తు నిర్వహణ దళం అవగాహన కల్పించినట్లు వరంగల్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ మామిడి భగవాన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలో ఫెమెక్స్‌లో భాగంగా గురువారం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన సదస్సులో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు, కమ్యూనిటీ బేస్డ్ వలంటీర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మామునూర్ ఏసీపీ బి.తిరుపతి, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రమేష్, స్టూడెంట్ అమ్నిటీ సెంటర్ విద్యార్థులు వరంగల్, హనుమకొండ, జీడబ్ల్యూఎంసీ అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



ఎల్కతుర్తి : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



వేలేరులో..



శాయంపేటలో..



పరకాలలో..



దామెరలో..

ఎల్కతుర్తి : చిన్నారుల ఆరోగ్యాన్ని బలహీన పరిచే నులిపురుగులను నిర్మూలిద్దామని ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్ అన్నారు. భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ పరిధిలో గల విద్యార్థిని, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నులిపురుగును నిర్మూలించేందుకు ప్రభుత్వం 1నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అలాగే ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. స్థానిక వైద్యులు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలను ఉచితంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వివిధ కారణాలతో అందుబాటులో లేని విద్యార్థులకు ఈనెల 27వ తేదీన పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, డాక్టర్ ముతార్ రహమాన్, డాక్టర్ రుబీనా, సిబ్బంది కెల్ఎన్ స్వామి, స్వరూప, శ్యామల, ఉపాధ్యాయులు శ్రీకాంత్, ప్రదీప్, సుధారాణి, స్టాలిన్, ఎల్లయ్య, రామకృష్ణారెడ్డి, మోహన్, సమ్మిరెడ్డి, ఉమా, దుర్గయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల శ్రీవేద పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ వైద్యాధికారి అభినందన్‌రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణి చేశారు. చిన్న పిల్లలు నట్టల వలన అనారోగ్యానికి గురవుతారని, నట్టలను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్, ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, శ్రీవాణి, సల్మా, మౌనిక, ఏఎన్ఎం సరళ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారిణి మంజుల అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండల వ్యాప్తంగా గురువారం వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 7,362 మంది విద్యార్థులకు 6,593 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, ప్రధానోపాధ్యాయుడు లకావత్ రాజేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇంజపల్లి నరేష్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, కారోబార్ బొబ్బిలి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతిఒక్కరూ నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరితలు కోరారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులి పురుగుల ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండకపోవడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ కుమార్, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : 19 సంవత్సరాల్లోపు ఉన్న ప్రతిఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు గురువారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్వాతి, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



కమలాపూర్ : మండలంలోని భీంపల్లి ఎస్సీ కాలనీలో, ఉప్పల్-జమ్మికుంట ప్రధాన రహదారి మలుపు వద్ద సుమారు 20 రోజుల క్రితం పైప్‌లైన్, కేబుల్ మరమ్మతుల కోసం రోడ్డుకు సగం వరకు ఓ పెద్ద గొయ్యి (కందకం) తవ్వారు. 20 రోజులు దాటుతున్నా పూడ్చలేదు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు గొయ్యిలో పడి గాయాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చివేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.